ప్రజా సేవకుడు

శ్రీ కె. సభా

నంజప్ప చాలా నాజూకైన మనిషి. నలభై సంవత్సరాలు నిండినా నవనాగరికత ఆయనలో నాట్యం చేస్తూనే వుంటుంది. గోరంచు మిల్లు పంచె, యం. యస్. లాంగ్ క్లాత్ జుబ్బా, టర్కీ టవలు అతడు అప్యాయంగావాడే వస్తువులు. మెలివేసిన మీసాల కొసల్లో గజనిమ్మపండ్లు నుంచితే అలాగే నిలబడుతాయని ప్రతీతి. ఆ ఠీవి ఆ దర్పము గ్రామాన్నంతా హడలెత్తించేవి.

రెండవ ప్రపంచ యుద్ధంలోనే నంజప్ప రాజకీయాల్లో ప్రవేశించాడు. ఆనాడు తానుచేసిన సహాకారానికి ప్రభుత్వం దివాన్ బహద్దూర్ అనే బిరుదాన్నిచ్చి సత్కరిస్తుందని ఆశించాడు. కానీ అలా జరుగలేదు. చివరకు జిల్లాబోర్డుకు మెంబరుగా నామినేట్ చేశారు.

ఇంతలో దేశంలో కాంగ్రెస్ వాళ్ల హడావిడి హెచ్చింది - ఫలితంగా ఏదో స్వతంత్రం వచ్చేసిందన్నారు. దేశమంతా వెంటనే మారిపోతుందన్నారు. దేశం ఎంతమట్టుకు మారిందో ఎవరికీ తెలియదుగానీ నంజప్ప మాత్రం కొద్దిగా మారిపోయాడు. టర్కీ తువ్వాలు స్థానే సరిగంచు ఖాదీపంచ; కట్టుపంచ స్థానే ముతక ఖద్దరు; లాంగ్ క్లాత్ స్థానంలో కావిరంగు దేశీయజుబ్బా కనబడ్డాయి. మీసాలనుగూడా కొద్దిగా కత్తిరించాడు. చలవ కళ్లజోళ్లు ఒక క్రొత్త అందాన్ని తెచ్చిపెట్టింది.

ఏవో ఎన్నికలు మన్నికలు అంటుండగానే నంజప్ప కాంగ్రెస్ రాజకీయాల్లో అంతగా కనబడక పోయినా ఏదో మళ్ళీ ఒక ముఖ్య స్థానాన్ని ఆక్రమించినట్టు మాత్రం తెలిసింది. ఆనాటినుండి వారిలో చాలా ప్రత్యేకతలు కనబడుతూ వచ్చినై. గ్రామానికి సంబంధించిన సమస్త వ్యవహారాలూ తనచేతిమీదుగానే జరగాలనే పట్టుదల వారిలో ఎక్కువైంది.

కుంట కట్ట మరమ్మత్తుకోసం గ్రామస్థులను రాయబారం తీసుకెళ్ళాడు. దైవకార్యంలాగా అందరూ నడుంకట్టి అనుకరించారు. ఐదువేల రూపాయల కాంట్రాక్టు. అందులో మూడువేలు నంజప్పగారు శుభ్రంగా మిగుల్చుకున్నట్లు తేలడానికి ఎన్నో రోజులు పట్టలేదు. ఆరోజునుండి నంజప్ప అంటే గ్రామంలో ఎవరికీ పడదు. కానీ పైకి మాత్రం ఆయన్ని గౌరవించక ఎవరికీ తప్పలేదు.

నంజప్ప చాలా మంచివాడేగాని లంచగొండి అని కొందరనేవారు. కాదు వారు గొప్ప కార్యసాధకులు. ఎన్నో తరాలనుండి రిపేరుకాని కుంట కట్ట వారి కాలంలో రిపేరైందని మరికొందరు పొగిడేవారు.

కాలం యిలా దొర్లుకుపోతుంటే కరువుదేవత వికటాట్టహాస ఘోషలతో గ్రామంలో అడుగు పెట్టింది. రైతులవద్దనున్న బంగారంలో ముప్పాతిక వంతు నంజప్ప బొక్కసంలో దాక్కోవలసి వచ్చింది. నంజప్ప మాత్రం చాలా చురుగ్గా బహు హుషారుగా ప్రజాసేవలో లీనమైనాడు. అతనికి తీరిక అంటూ చిక్కడంలేదు. దాదాపు వంద చెడ బావులు కంట్రాక్టు పుచ్చుకొన్నాడు. చాలినంత డబ్బులు ఖర్చుపెట్టి అధికార్ల అండ దండల్ని సంపాయించాడు. లోన్సు అధికారులకు ఎన్నో విందులు చేశాడు. ఆ చుట్టుపట్ల గ్రామాలనుండి తన యింటికి అనుదినం లెక్కలేనన్ని కోడిగ్రుడ్లు పాలకావిళ్ళు వస్తుండేవి. ఇప్పుడు నంజప్పగారి యిల్లు నగరైపోయింది. వారికి ఒక చిన్నకారు

కూడావుంది. అతడు కష్టజీవి గనుక ప్రభుత్వం కూడా గమనించి వ్యవసాయాభివృద్ధికి పదివేల రూపాయలు అప్పు పెట్టింది. ఆ డబ్బుతో క్రొత్తగా బస్సురూటు సంపాదించి ప్రయాణీకుల సౌకర్యం కోసం బస్సును అవసరమైతే ఎక్కువసార్లు నడుపుతున్నాడు. రూటు రోజుకు మూడుపూటలిస్తే ప్రజల సౌకర్యార్థం ఐదుసార్లు నడిపిస్తాడు. ఎవరికీ సీటులేదనకుండా ఓవర్‌లోడ్ వేసే ధర్మన్యాయం నంజప్పలో మూర్తీభవించింది.

బస్సువ్యాపారం ప్రారంభించినప్పటినుండి నంజప్ప పలుకుబడి బాగా హెచ్చింది. నంజప్ప బస్ సర్వీస్ పరివారం కూడా కొంత బలాన్నిచ్చింది. నంజప్ప మాటకు ఎదురులేదంటే అతిశయోక్తి అట్టే వుండదు.

గ్రామంలో రైతులు చాలా నీరసించి పోయారు. ప్రక్కింటి వరాలు తన పదిఎకరాలు అమ్మాలనుకున్నాడు. అదివరకే రెండువేలు నంజప్పకు అప్పబడ్డాడు గనుక ఏడువేలకు పొలానిచ్చి రెండువేలు అప్పుపోగా వెయ్యిరూపాయలు బాకీగావుంచి రెండువేలు పుచ్చుకొని వెళ్లిపోయాడు. పదియెకరాల ఆసామే వెళ్లాక చిల్లర రైతుల విషయం చెప్పనే పనిలేదు. ఎవరికి వారే యమునాతీరే ఐపోయారు. సగంమంది పొలాలు నంజప్పకే ధారపోశారు. గ్రామంలో జనాభా చాలా మట్టుకు తగ్గిపోయింది. మిగిలిన ఆ కొద్దిమందీ వచ్చి మేమూ వూరువదలి వెడుతున్నామని గోలచేశారు.

నంజప్ప దయార్ద్ర హృదయుడు గదాని కనికరించారు. మీరంతా భయపడకండి, మీకు గంజి పోయిస్తానని అభయహస్తమిచ్చి అందరూ యిందులో సంతకాలు పెట్టండంటూ ఒక మహజరు వ్రాసి పెట్టాడు. కూలీలు రైతులు సంతోషంతో వ్రేలిముద్రలు వేశారు.

ఆ ఉదయమే నంజప్ప బాగా ముస్తాబై చక్కా జిల్లా అధికారి బంగళాకు వెళ్లాడు. నా గ్రామం స్మశానంలా తయారైంది. గంజికేంద్రం పెట్టకుంటే ఎవరిప్రాణాలూ దక్కవు, కనికరించాలంటూ అర్థించాడు. అందులో తానే స్వయంగావుండి నిర్వహిస్తానని నచ్చచెప్పి పదిమూటలు జొన్నలు నాల్గు బస్తాలు వుల్లిపాయలు, రెండుబస్తాలు పెసలు, రెండు బస్తాలు గోధుమలు, బస్తా ఉప్పు, బండకెక్కించుకొన్నాడు. బంగళా దాటుకొన్నదే బేరం ప్రారంభమైంది. ఉచితంగా వచ్చిన సొమ్ముగనుక ఐదువందలకు అక్కడే విక్రయించుకొని యిల్లువచ్చి చేరాడు.

గంజి కేంద్రం ఆరంభమౌతుందని గంపెడాసతో నున్న గ్రామస్థులు ఏమయిందంటూ అడిగారు. ఇంకోవారం అన్నాడు. ఇలాగా మూడుమాసాలు దొర్లిపోయినై. నంజప్పగారికీ వ్యాపారంలో అప్పుడే మూడువేలు లభించినై.

ఈలోగా ఎవరో కిట్టనివారు మెల్లగా పుకారు లేవదీశారు, నంజప్ప గంజిగింజలు అమ్మివేస్తున్నాడని. వెంటనే నంజప్ప మేలుకొని దేనికైనా మంచిదని ఊళ్లో ఒకచోట గంజిదొడ్డి ప్రారంభించాడు. రోజుకు 28 శేర్ల జొన్ననూక, 5 శేర్లు బియ్యం, మూడు శేర్ల పెసరపప్పు, ఒక్క మణుగు ఉల్లిపాయలు లెక్క చూపుతూ రిజిస్టర్లను సక్రమంగా వుంచాడు. పనిచేసే వారికి జీతాలు; కట్టెల ఖర్చులు; మోతకూలీలు; బండి బాడుగులు; వీటిక్రింద ప్రతినెలా వందాయాభై రూపాయలు లెక్కచూపేవాడు. నిజానికి నాలుగు శేర్లు జొన్ననూకలు పోసి రెండు బానలు గంజికాచి అందులో రెండు బానలు నీరుపోసి నాలుగుబానలు పోయించేవాడు. ఆ గంజికూడా తనపొలంలో సేద్యం చేసేవారికేగానీ యితరులకు ఒక్కచుక్కైనా పోసేవాడు కాదు.

ఈ విషయం అంతా ఆ వూరి కరణంగారికి తెలియక పోలేదు. ఆయన యిందులో కల్పించుకుంటాడనే, హుషారుగా కరణంగారికి రోజుకొక శేరు బియ్యం పంపించేవాడు. మునసబుగారి యింట్లో రోజూ పెసరట్లే టిఫినైపోయింది. కరణంగారికి ప్రతిపూటా ఉల్లిగడ్డల సాంబారు రుచిగావుండేది

నంజప్ప మాత్రం రోజుకు ఇరవైనాలుగు శేర్లు చొప్పున మిగిల్చి ఎప్పటికప్పుడు అమ్మివేసేవాడు.

కరణం మునసబులు చేతిలో వున్నారు గనుక ఆయనకు యేతొందరగూడాలేదు.

ఇంతలో ఆ గ్రామానికి ఒక కొత్త స్కూల్ మాస్టర్ బదిలీ అయ్యాడు. ఆయన చాలా పని వాడు. ఓ నాడు గంజికేంద్రాన్ని చూచాడు. అతనికి చాలా ఆశ్చర్యం గల్గింది. వారి స్వగ్రామంలో గంజిపోస్తున్నారుగానీ ఆ విధానంలేదు...

అక్కడ ప్రతివానికి చీటీయిచ్చివున్నారు. ఆ చీటీచూచి అందులో గుర్తుపెట్టుకొని గంజిపోయించుకోవాలి. ప్రతివానికీ అర్ధశేరుకు తక్కువ కాకుండా పోస్తారు. పైగా అక్కడయిచ్చే రేషన్ యింతేవిసా పదేసు కడవలు నిండుతాయి. వాటిలో వుల్లిపాయలు పెసరపప్పు గోధుమలు కలిసి వుండడంవల్లా చాలా కమ్మగా మధురంగా రుచిగా కూడా వుంది. అక్కడ కూలీలందరూ సరదగా పోసుకొని సంతోషంగా త్రాగి వెడుతుంటారు. గంజిపోసేవారు నవ్వుముఖాలతో వుంటారు. పనిచేసేవారు వుచితంగా చేస్తారు.

కట్టెలు గంజిత్రాగేవారే స్వయంగా బండ్లకొద్ది తెచ్చి పారేస్తున్నారు. గంజిదొడ్డికి ఒక ప్రత్యేకమైన కొట్టంవేయబడింది. చక్కని పందిరి నీడకోసం నిర్మించబడింది. గ్రామంలో యువకులందరూ శ్రద్ధపుచ్చుకొని పనిచేస్తుంటారు. గంజిగూడా చాలా మెత్తగా ఎక్కువ గట్టిగా కనబడుతుంది.

కానీ యిక్కడ అలాగాలేదు. యమకింకరుల లాగా యిద్దరు మనుష్యులు నిలువు కఱ్ఱబుచ్చుకొని ఆ యనాధ బిడ్డల్ని గెంటివేస్తున్నారు. ఆ తోపుల్లో వృద్ధులు నేలమీదపడి సోలిపోతున్నారు. ఒట్టి తొక్కు అడుగునపోగా మిగిలి కొద్దిగా వాసనవేసే కుడితికోసం పడుతున్న కీచులాట! ఆ విషాదపూరిత నయనాలనుండి చిమ్ముతున్న ఆకలిజ్వాలలు అతని కడుపును రగిల్చివేసినై.

"ఎవరీ గంజిపోయుటం? ప్రభుత్వమా? ప్రత్యేకమైన సంస్థఏదైన పోస్తున్నదా?" అన్నాడు పంతులు.

మాకు తెలియదన్నాడు ఆ గంజిపోసే కింకరుడు. ఆ ఆవేదనాపూరిత దృశ్యాన్ని చూడలేక బడికి వచ్చేశాడు పంతులు. కానీ అతని మనస్సు నెమ్మదిగా వుండలేక పోయింది. ఆరాత్రి హరిజనవాడకు వెళ్లి

మెల్లగా ఆ చూకీ తీశాడు. విషయం తెలుసుకొన్నాక అతనికి ముచ్చెమటలు పోసినై. లోకంలో అనాథలను పోషించే అదృష్టంలేక ఎందరో అఘోరిస్తున్నపుడు అందే గంజినిగూడా దొంగిలించే నీచులు కిరాతకులు వున్న విషయం అతనికి క్రొత్తగా కనిపించింది. కానీ ప్రఖ్యాతిగన్న మనదేశంలో శిబిచక్రవర్తులు కీర్తిగన్న ఈ పవిత్రభారతంలో ఈలాంటి గంజిదొంగలు యెందరున్నారో అతనికి తెలియదు. ప్రత్యేకించి రాయలేలిన రతనాలసీమలో వందలుగాదు వేలమంది ఈ వ్యాపారంలో వేలనుగడిస్తూ డబ్బుతోపాటు మహాదాతలని దానకర్ణులని పేర్లు సార్జించుకుంటున్న విషయం అతనికి తెలియదు.

అతని హృదయంద్రవీభూతమై పోయింది. ఆ వేడిలో అధికారికి పెద్ద రిపోర్టువ్రాసి గంజిత్రాగే వారినందరినీ సంతకాలు పెట్టమన్నాడు. అంతసాహసానికి నోచుకోనే గుండెలు వారికిలేవని అతనికి తెలియదు. కానీ అతిప్రయత్నం మీద ముగ్గురు మాత్రం వ్రేలిముద్రలు వేశారు. పంతులు గుండెలను రాయిచేసుకొని అదిరే చేతులతో అడ్రస్సు వ్రాసి టపాల్లో వేశాడు.

ఐదురోజులు గడిచాయి. ఉన్నట్టుండి అధికార్లు అమాంతంగావచ్చి గంజిదొడ్డిని తణిఖీచేసి తనకళ్ల యెదుట నంజప్ప చేతులకు బేడీలు వేసిలాక్కొని వెళుతారని అతడి ఆలోచన. అదేకలలు కన్నాడు. కానీ ఆరవరోజే అతనికి శ్రీముఖం అందింది. అతణ్ణి ఏకారణం చూపకనే అరువదిమైళ్ల కావల ఒకపల్లెకు మార్చివేశారు. ఆ రోజా సాయంకాలం నంజప్ప అతనిముందు సాక్షాత్కరించాడు. పీపాలకొద్దీ గంజి త్రాగి బలసిన బొజ్జలాగా కనబడే తనబొజ్జను నెమ్మదిగా తడుముకుంటూ...ఏమయ్యా చూచి పురుగుతిని పుట్టలోవుండకుండా యీలాంటి పనులకువస్తే యింతే జరుగుతుంది. ఇంతకూ పసివాడని, వృద్ధికి రావలసినవాడనీ విడిచిపెట్టాను. లేకుంటే శుభ్రంగా దేహశుద్ధి చేయించి పంపేవాణ్ణి. జాగ్రత్త అన్నాడు.

ఆ వికృత స్వరం వింటుంటే పంతులుకు చాలా అసహ్యంవేసింది. ముఖాన ఉమ్మివేద్దామన్నంత కోపం వచ్చింది. గొంతు నులిమేద్దామన్నంత వుక్రోషం వచ్చింది. కానీ లెక్కలేని పెసరట్లుతిని; మదమెక్కి ఆ మెలితిరిగిన కండలు; మణుగులకొద్దీ పుల్లిపాయలుతిని బలిసిన ఆ మాంసపర్వతానికి చాలినంత పలుకుబడివుంది. చెప్పగూడదు కానీ అతడు ఒక బాధ్యతాయుత స్థానంలోగూడావున్నాడు. పరిపాలనలో భాగముంది. అలాంటపుడు తనేంచేయాలి? ఒక కన్నీటి చుక్కనువిడిచి వెళ్లడం శ్రేయస్కరమనుకున్నాడు. ఉదయం కానీ బస్సులేదు. ఆ రాత్రి అరిచేత ప్రాణాలు పెట్టుకొని బడిలోనే పడుకున్నాడు. అర్ధరాత్రి సుమారు వందరాళ్లు పడ్డాయి. ఎలాగానో ప్రాణాలు చిక్కబట్టుకొని ఉదయం నంజప్పగారి దుర్భేద్యమైన కోటనుండి తప్పుకొని బయట పడ్డాడు. అతడు వెళ్లిన సాయంకాలమే ఐదారుమంది పోలీసులు వచ్చారు. రిపోర్టులో వ్రేలిముద్రలు పెట్టిన ముగ్గురు యువకుల యిండ్లపై దాడి చేశారు. పదిహేడు సారాబుడ్లు స్వాధీనం చేసుకొన్నారు. ఈ బుడ్లు నంజప్పచేత స్వయంగా పంపి వారి పూరిపాకచూరుల్లో అక్షణానికి ముందే దాచబడినై. వాటిని అక్కడదాస్తున్నపుడు యింటిలోని ఆడవాళ్లు అడ్డురాకపోలేదు గానీ ఎఱ్ఱటోపీల భయం వెనక్కిలాగింది. ముగ్గురి వీపులు విమానంమ్రోత మ్రోగి పోయినవి. నంజప్ప పెట్టిన కోడి ఫలావుతిని అది జీర్ణం అయ్యేదాక బెల్టులు తీసుకొని ఆ ముగ్గురినీ చితగ్గొట్టారు. గ్రామమంతా ఆదృశ్యాన్ని చూచి ఆక్రోశించి పోయింది. కలిగినవారికి ఎదురునిలిచితే మిగిలేవి చెప్పుదెబ్బలే నన్నారు అనుభవజ్ఞులు.

ఆ మరునాడు పోస్తున్న గంజిగూడా ఆగిపోయింది. యిలాగా ఒక్కవారం రోజులు దొర్లిపోయినవి. ఆ మధ్య ఒకనాడుమాత్రం వరుసగా పదేను బానలుంచి ముప్పైశేర్లు నూకలుపోసి చాలా గట్టిగా గంజికాశారు. ఆ దినం యెవరో ముగ్గురు పెద్ద అధికార్లు వచ్చారు. నంజప్ప స్వయంగా ముంతను తీసుకొని అందరికీ గంజిపోశాడు. వచ్చిన అధికార్లు ఆశ్చర్యచకితులైనారు. ఆ మధ్యాహ్నం అధికార్లకు చాలా ఆడంబరంగా విందుజరిగింది. చుక్కలేని తెల్లని పొట్టేలు పిల్ల...చిన్న సంబావుల

పచ్చిబియ్యం...పులావు ఘుమఘుమలాడింది. కరణం మున్సబు నంజప్ప అధికార్లు సంతృప్తిగా తిన్నారు. ఇలాంటి విందులెన్నో చూశానుగానీ యింతరుచి కరంగా లేదని పెద్ద అధికారి సర్టిఫై చేశారు. "టైంచాలక పోయింది. లేకుంటే యింకా ఎన్నో చేశేవారమని ఎక్కువగా తిని కడుపు నొప్పితో బాధ పడుతూ పళ్లికిలించాడు కరణం. కొవ్వుగలిగిన పిల్ల కొత్తపొట్టేలన్నాడు పొట్టను తడుముకుంటూ మున్సబు.

ఆ సాయంకాలం పెసరపప్పుతో తయారైన పోళీలు భోంచేశారు అధికార్లు. ఇక పనిముగిసిందని గర్వంతో అధికార్లను సాగనంపాడు నంజప్ప.

గంజిదొడ్డికి సంబంధించినంత వరకూ నంజప్ప చాలా బాగా వ్యవహరిస్తున్నాడని అభిప్రాయ పడ్డారు అధికార్లు. కిట్టని వారంతా ఎన్నో చెబుతారని వాటిని పాటించక ప్రజాసేవచేయాలని చెప్పాడు పెద్ద అధికారి. చిత్తమంటూ తలసాడించాడు నంజప్ప.

మరుచటివారం నంజప్ప అధికార్లవద్దకు వెళ్లాడు. ఇస్తున్న రేషన్ చాలదని అందరిలోనూ ముందుబడి పోట్లాడాడు. పేదలకోసం ఎంతశ్రద్ధ! ఇతనికంటే ప్రజాసేవకుడు లేదనుకొన్నారు అక్కడ విన్న వారందరూ. త్రాగేవారు అరువందలై పోయారని వారికి రేషన్ రెండింతలు పెంచాలని పట్టుబట్టాడు. అధికార్లు ఈ దానకర్ణుని ఉపన్యాస పటిమకు మెచ్చుకొని రోజుకు 36 శేర్లు జొన్నలు; 9 శేర్లు బియ్యము; 8 శేర్లు గోధుమలు; 6 శేర్లు పెసలు; రెండుమణుగులు ఉల్లిపాయలు సప్లయి చేయించారు.

ఆ రోజునుండి నంజప్ప స్వయంగా ఒక పెద్ద అంగడి పెట్టించాడు. మూడింట ఒకభాగానికి మునసబు కరణాలు భాగస్వాములు. వర్తకం బాగానే జరుగుతున్నది. కరణంగారి తమ్ముడు అందులో నియుక్తుడైనాడు. అమ్మకం యెలావున్న సాయంకాలం కరణంగారి గృహంలో పోళీల సువాసన కమ్మగా వస్తుంటుంది. మున్సబుగారి వంటయింటి అలమారా నిండుకు ఉల్లిపాయలే. నంజప్పగారి ఇనప్పెట్టెలో మాత్రం ప్రతివారం మూడువందల పచ్చనోట్లు వెళ్లి విశ్రాంతి తీసుకుంటున్నవి;

రిపోర్టులో వ్రేలిముద్రలు వేసిన ముగ్గురు యువకులూ అదృష్టవంతులు. వారు సాహసించి వ్రేలిముద్రలు వేసినందుకు బెల్టుదెబ్బలు తిన్నా యిప్పుడు జైల్లో కడుపునిండుగా సంకటి తింటున్నారు. ఆ సాహసానికిగూడా నోచుకోని వారికి అసలు గంజికూడా కరువైపోయింది.

ఇంతకూ నంజప్ప ఘరానావ్యక్తి. త్వరలో ఆయన జాతకంలో యం. ఎల్. ఏ అయ్యేయోగం వుందని ఎవరో కార్తాంతికుడు చెప్పాడట. అందుకోసం ఆయన అన్నివిధాలా ప్రయత్నిస్తున్నాడు. అదృష్టంవుంటే ఆతడు మంత్రిగూడా కావచ్చునేమో; ఆ ప్రజాసేవా భారాన్ని మోయడానికి చాలినంత బలంకావాలి, అందుకోసం వేలకొలది పీపాలగంజి త్రాగుతున్నాడు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన కడుపులో కృష్ణమూర్తిలాగా ప్రపంచాన్ని దాచుకున్నాడు, కొంచెం దూరదర్శిని సాయంతో చూచామంటే ఆయన కడుపులో ఎన్నోరోడ్లు పరుగిడుతుంటాయి. లెక్కలేని రోడ్లకంట్రాక్టరతడు. ఎన్నో చెరువులున్నాయి. మరెన్నో కుంటలున్నాయి. అలాంటి మహానాయకుడు ఆ గ్రామాధినేత! శ్మశానంలాంటి ఆ గ్రామాన్ని ఏలుతున్న పెనుభూతమతడు.

అతడెక్కడో వున్నాడనుకోవడం పొరపాటు. అతని కారు రయ్యిమని మన కళ్లముందే పోతున్నది. అతడు సామాన్యమైన వ్యక్తిగాదు. అనర్గళంగా వుపన్యసించగలడు. మొన్న మొన్ననే కరువు నివారణ కమిటీ సభ్యుడైనాడు. ఈ విషయం తెలిసిందే తన స్వగ్రామంలో మిగిలిన నాలుగు కుటుంబాలు కొంపలు విడిచి వలసలువెళ్లి పోయ్యారు. ఆయన ఘనత ఇంకెన్ని విధాలుగా సువాసనలను విరజిమ్మబోతున్నదో తెలియదుగానీ మళ్లీ ఏదో పేదవిద్యార్థులకోసం హాస్టలు పెట్టబోతున్నాడని ఒక పుకారు లేచింది.

ఎంతమట్టుకు నిజమో గదా!

——(0)——